# కొల్లాపూర్‌లో 51 సమస్యాత్మక గ్రామాలు

■ **రెవెన్యూ అధికారుల వెల్లడి**

కొల్లాపూర్, అక్టోబర్ 25 : అసెంబ్లీ ఎన్నికలను అధికారులు పకడ్బందీగా ముందస్తు చర్యలను చేపట్టారు. నియోజకవర్గంలో మొత్తం 269 పోలింగ్ కేంద్రాలుండగా ఇందులో 51 గ్రామాల్లో 121 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు రెవెన్యూ, పోలీస్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్‌కుమార్‌దీపక్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదికను పంపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికశాతం ఓట్లు పోలైన పోలింగ్ కేంద్రాలను సైతం అధికారులు గుర్తించారు. ఇందులో అత్యధికంగా పోలైన కేంద్రాల్లో పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల పోలింగ్ కేంద్రం నంబర్ 1లో, మరికల్ పోలింగ్ కేంద్రం 12 లోనూ, మహాసముద్రం పీఎస్ నంబర్ 38లో, పాన్‌గల్ మండలం కిష్టాపూర్ పీఎస్ నంబర్ 103లో 90శాతం అత్యధికంగా ఓట్లు పోలైనట్లు గుర్తించారు. పెద్దకొత్తపల్లి మండలంలో మొత్తం 9 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించగా, వీటిలో వెన్నచర్ల1, చంద్రకల్‌లో2, మరికల్‌లో 1, దేవునితిర్మలాపూర్‌లో 1, జొన్నలబొగుడలో 2, మహాసముద్రంలో 1, సాతాపూర్‌లో 4, మారెడుమాన్‌దిన్నెలో 2, కల్వకోలులో 5 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. కోడేరు మండలంలో నాలుగు గ్రామాలకు గానూ 9 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నాయని గుర్తించారు. ఇందులో నార్యానాయక్‌తండాలో 1, ఎత్తంలో 3, కొండ్రావుపల్లిలో 2, నర్సాయపల్లిలో 3 పోలింగ్ కేంద్రాలున్నాయి. పాన్‌గల్ మండలంలో రేమొద్దులలో 4, గోప్లాపూర్‌లో 2, కిష్టాపూర్‌లో 1, అన్నారంలో 2, మహ్మదాపూర్‌లో 2, పాన్‌గల్‌లో 4,తెల్లరాళ్లపల్లిలో 2, చిక్కేపల్లిలో 2, బండలపల్లిలో 1, రాయిన్‌పల్లిలో 1, బుసిరెడ్డిపల్లిలో 2, కేతేపల్లిలో 3 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. వీపనగండ్ల మండలంలో బొల్లారంలో 2, వల్లభాపూర్‌లో 1, కల్వరాలలో నాలుగు, పుల్గర్‌చర్లలో 2, తూంకుంటలో 3, సంగినేనిపల్లిలో 3, గోవర్ధన్‌గిరిలో 2, వీపనగండ్లలో 5 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు గుర్తించారు.

అలాగే చిన్నంబావి మండలంలో వెలుగొండలో 2, దగడపల్లిలో 3, పెద్దదగడలో 3, లక్ష్మిపల్లిలో 1, చెల్లెపాడ్‌లో 1, కొప్పునూర్‌లో 4, చిన్నమారూర్‌లో 1, పెద్దమారూర్‌లో 3 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. పెంట్లవెల్లి మండలం మొత్తంలో కొండూరులోని 2 పోలింగ్ కేంద్రాలు, కొల్లాపూర్ మండలంలో కుడికిళ్లలో 4, చింతలపల్లి, ఎన్మన్‌బెట్ల, చౌటబట్ల, మొలచింతపల్లి, నర్సింహాపురంలో ఒక్కొక్కటి చొప్పున, చుక్కాయపల్లిలో 2, కొల్లాపూర్ పట్టణంలో 11, ఎల్లూరులో మూడు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా ఎన్నికల అధికారులు గుర్తించి రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదికను పంపారు. ఇంతే కాకుండా గతంలో జరిగిన అసెంబ్లీ, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సం దర్భంగా రాజకీయ ఘర్షణల మూలంగా ఏ ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో చోటు చేసుకున్నాయో ఆయా కేసులకు సంబంధించిన క్రైం నెంబర్లు, సెక్షన్లతో సహా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఎన్నికల అధికారులు నివేదికను పంపినట్లు రెవిన్యూ వర్గాలు తెలిపాయి.



చిన్నంబావిలో వాహనాలను తనిఖీ చేస్తున్న కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బంది




కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ మ్యాప్

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

చిన్నంబావి, అక్టోబర్ 25 : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కోడ్‌ను ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామనిఎస్సై కృష్ణ ఓబుల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు వివిధ రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు నడుచుకోవాలన్నారు. పార్టీల సమావేశాలకు, ప్రచార రథాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్‌ను తూచ తప్పకుండా పాటించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా మండల నాయకులు, ప్రజలు పోలీస్‌శాఖ, ఎన్నికలశాఖ అధికారులకు సహకరించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సూచించారు.

### వాహనాల తనిఖీలు..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు, ఇతర వస్తువుల సరఫరాకు అడ్డుకట్ట వేసేందుకు గురువారం చిన్నంబావిలో కేంద్ర బలగాలు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తు పంపిస్తున్నారు. ఎవరైన మద్యం, డబ్బు అక్రమంగా తరలిస్తే వారిపై చర్యలు ఉంటాయని, రూ.50వేల లోపు డబ్బుకు ఎలాంటి అనుమతి అవసరం లేదని, రూ.50వేల కంటే ఎక్కువ ఉంటే సంబంధిత రసీదులను చూపించాలని ఎస్సై సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బీఆర్‌ఎస్ గెలవడం ఖాయం

కొల్లాపూర్ రూరల్, అక్టోబరు 25 : కొల్లాపూర్ గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తోందన్నారు. సోమశిల సిద్ధేశ్వరం వంతెన నిర్మాణంతో కొల్లాపూర్ రూపురేఖలు పూర్తిగా మారిపోయినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రతి గుంటకు, ప్రతిసెంటుకు సాగునీరందుతోంది అంటే అది సీఎం కేసీఆర్ కృషితోనే సాధ్యమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న వంతెనలను పూర్తి చేయించి ఎమ్మెల్యే ప్రజల కష్టాలను తీర్చారన్నారు. సీఎంఆర్‌ఎఫ్, ఎల్వోసీలతో ప్రజల ఆరోగ్యం కోసం బీఆర్‌ఎస్ పెద్ద పీట వేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లిలో జూనియర్ కళాశాలలు, కొల్లాపూర్‌లో ఉద్యానవన, డిప్లమా పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో రఘువర్ధన్‌రెడ్డి

కోడేరు, అక్టోబర్ 25 : మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన వారు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి బీఆర్‌ఎస్ నాయకులు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బద్దుల రామస్వామి, బాలస్వామి, బాలు, వెంకటేశ్, రమేశ్, మైబూస్‌తో పాటు మరో 20 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జూపల్లి కుట్ర రాజకీయాలను మానుకోవాలి

కొల్లాపూర్ రూరల్, అక్టోబరు 25 : కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి జూపల్లి కుట్ర రాజకీయాలను మానుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు రంగినేని అభిలాశ్‌రావు హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జూపల్లి కొంత మంది యువతకు మద్యం, సెల్‌ఫోన్‌లు ఇచ్చి తప్పుడు ప్రచారాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జూపల్లికి 20 ఏండ్లు ప్రజలు అవకాశం ఇస్తే కొల్లాపూర్ అభివృద్ధి కోసం ఏమి చేయకుండా ఇప్పుడు తప్పుడు పద్ధతిలో తప్పుడు ప్రచారాలు చేస్తూ కుట్ర, కుతంత్రాలు చేస్తున్నారన్నారు. జూపల్లి ఎన్నికుట్రలు చేసిన కొల్లాపూర్ నియోజకవర్గంలో పారవన్నారు.

## క్రీడాకారులకు క్రికెట్‌కిట్ పంపిణీ



కల్వకోల్ యువతకు క్రికెట్‌కిట్‌ను అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 25 : మండలంలోని కల్వకోలులో క్రీడాకారులకు క్రికెట్‌కిట్‌ను గ్రామ బీఆర్‌ఎస్ నాయకుడు వెంకటస్వామి యువతకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో నైపుణ్యత సాధించేందుకు సేవాభావంతో క్రికెట్‌కిట్‌ను అందించినట్లు ఆయన తెలిపారు. యువత క్రీడల్లో నైపుణ్యత సాధించి జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సాధన చేయాలని ఆయన వారికి సూచించారు. సీఎం కేసీఆర్ గ్రామస్థాయిలో యువతను క్రీడల్లో నైపుణ్యత సాధించేందుకు క్రీడాప్రాంగణంలో ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు వివిధ పోటీల్లో రాణించేందుకు ఫిజికల్ డైరెక్టర్లను ఏర్పాటు చేసి క్రీడలను ప్రోత్సహిస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

## ఆర్థికసాయం అందజేత

పాన్‌గల్, అక్టోబర్ 25 : మండలంలోని శాగాపూర్ గ్రామానికి చెందిన పుట్టపాగ చిన్నరాములు ఇటీవల హైదరాబాద్‌లో ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ సందర్భంగా సర్పంచ్ మౌనిక, ఉపసర్పంచ్ లలిత బుధవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు నగదును అందజేశారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతి, చంద్రయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దుర్గామాత నిమజ్జనం

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 25 : మండలంలోని పెద్దకారుపాముల, పెద్దకొత్తపల్లి, ముష్టిపల్లి, కల్వకోల్ తదితర గ్రామాల్లో 11 రోజులపాటు దేవీ శరన్నరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చివరిరోజున దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్దకొత్తపల్లికి చెందిన ఆర్యవైశ్య నాయకుడు సాయిరాజా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దుర్గామాతను ఊరేగింపు చేస్తూ మహిళలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువులో దుర్గామాతను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మల్లేశ్, సుధాకర్, రామకృష్ణ, ఆంజనేయులు, శంకర్ తదితరులు ఉన్నారు.

### నందికోళ్ల ఉత్సవాలు

పాన్‌గల్, అక్టోబర్ 25 : మండలంలోని కేతేపల్లి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో బుధవారం అమ్మవారి నందికోళ్ల ఉత్సవాలు ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. పూజారి వంశీకృష్ణ ఆధ్వర్యంలో భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజనలు చేస్తూ అమ్మవారిని వాహనంలో గ్రామంలో ఊరేగించారు. కన్యకాపరమేశ్వరీ అమ్మవారు తమతమ కుటుంబాలను చల్లగా చూడాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వీర ప్రతాప్‌శెట్టి, రాంబాబుశెట్టి, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో హోమం

కొల్లాపూర్, అక్టోబర్ 25 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా పట్టణంలో వరిదేల శమీ వృక్షం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండపం ఆవరణలో పురోహితుల హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలుజంటలు పాల్గొన్నాయి. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ చేశారు. సాయంత్రం పట్టణంలో ప్రధాన రహదారిలో కనులపండువగా అమ్మవారి శోభాయాత్ర, మంగళ వాయిద్యాలతో నిర్వహించారు. కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఏర్పాటు చేసిన నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పూర్ణాహుతి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. అలాగే ఎల్లూరు, నార్లాపూర్, సింగవట్నం గ్రామాల్లో దుర్గామాత నిమజ్జనం జరిగింది.



ముష్టిపల్లిలో దుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



కొల్లాపూర్ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పూర్ణాహుతి అలంకరణలో దుర్గామాత



వరిదేలలో హోమంలో పాల్గొన్న భక్తులు